## గ్రామాల అభివృద్ధికి
# కేంద్ర నిధుల వినియోగం: ఎంపీ డీకే అరుణ

**ధన్వాడ, జనవరి 25 ప్రభాతవార్త :** ఉమ్మడి జిల్లాలోని గ్రామాలను ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేయడానికి ఎంపీ నిధులతో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఎన్ఆర్‌జీఎస్ (ఉపాధి హామీ) నిధులను వినియోగిస్తామని ఎంపీ డీకే అరుణ తెలిపారు. ఆదివారం ధన్వాడ మండలంలోని కంసాన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన వికాసిత్ జీ రామ్ జీ పథకంపై అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో పని దినాలను 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచామని చెప్పారు. వికాసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా యువతి-యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కుటీర పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. 2047 నాటికి భారతదేశాన్ని ప్రపంచంలోనే నెంబర్ వన్ ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలన్నది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యమని ఆమె అన్నారు.ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధులు తగ్గిస్తుందని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా బీజేపీ అధ్యక్షుడు సత్య యాదవ్, రతంగ్ పాండ్ రెడ్డి, పగడాకుల శ్రీనివాసులు, కంసాన్‌పల్లి సర్పంచ్ గౌడ్ వరలక్ష్మి, ధన్వాడ సర్పంచ్ పి.జ్యోతి, కిష్టాపురం సర్పంచ్ కొండయ్య, మంత్రోనిపల్లి సర్పంచ్ రవికుమార్, లింగంపల్లి తాండ సర్పంచ్ రాందాస్, గోవర్ధన్ గౌడ్, సుంకు ఉమేష్ కుమార్, మండల అధ్యక్షుడు శివరాజ్, శివకుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపి డికె అరుణ

మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

## వైభవంగా గట్టు తిమ్మప్ప
# జాతర మహోత్సవం

**పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి వాకిటి శ్రీహరి దంపతులు**

**మక్తల్‌టౌన్, జనవరి 25 ప్రభాతవార్త :** మక్తల్ మండలంలోని మాద్వార్ గ్రామ శివారులో వెలసిన శ్రీ గట్టు తిమ్మప్ప స్వామి (శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి) వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా రథసప్తమి సందర్భంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర పశు సంవర్ధక క్రీడల శాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. తిమ్మప్ప స్వామి బ్రహ్మోత్స వాలకు హాజరైన మంత్రికి ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికికారు. జాతర సందర్భంగా వాకిటి శ్రీహరి పట్టు వస్త్రాలతో భాజాభజంత్రీల మధ్య స్వామి వారి దేవాలయానికి గుట్టపై చెరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న మంత్రి శ్రీహరిని ఆలయ ధర్మకర్తలు వైష్ణవం ప్రహ్లాద్, వైష్టవం సురెందర్ తీర్థప్రసాదాలు అందజేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహద్వార్ గ్రామ సర్పంచ్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రాజేశ్వరరావు, సంతోష్ రెడ్డి,సత్యనారాయణ, బి.శంకర్, వడ్ల బాలరాజ్, కాంగ్రెస్ మక్తల్ టౌన్ అధ్యక్షులు ఏ రవికుమార్, ఆర్ఎంపి రామకృష్ణ, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

## మహబూబ్‌నగర్
# అభివృద్ధి బాధ్యత నాది

**పదేండ్లు పాలమూరును పట్టించుకోలే**

**సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో అద్భుతంగా చేస్తా**

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 25 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 24వ డివిజన్‌లో గల శ్రీశ్రీశ్రీ శివఆంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలో, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.8 లక్షల వ్యయంతో నిర్మించనున్న మల్టీ పర్పస్ షెడ్ నిర్మాణ పనులకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాబోయే 25 సంవత్సరాల్లో మహబూబ్ నగర్ ఎలా ఉండాలన్న స్పష్టమైన లక్ష్యంతో అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. గత పది సంవత్సరాలుగా మహబూబ్‌నగర్‌లో ఎలాంటి అభివృద్ధి -మిగతా4లో..



జాతీయ ఓటర్ దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## అత్యంత శక్తివంతమైన
# ఆయుధం ఓటు

**ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం**

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, జనవరి 25 ప్రభాతవార్త :** ప్రజాస్వామ్యంలో ఓటు అనేది అత్యంత శక్తివంతమైన ఆయుధమని, మంచి సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు. ఆదివారం వనపర్తి జిల్లా ఐడిఓసి(ఐడిఓసి) మీటింగ్‌హాల్‌లో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం ఇతర జిల్లాస్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ -మిగతా4లో..

# పర్యవేక్షణేది..?

**అనుమతులే లేని స్కూళ్లు ఎన్నో**

**అనుమతి ఉన్నా..**

**కనీస సౌకర్యాలు సున్నా**

**ఫిట్‌లెస్ బస్సులు**

**ఫైర్ సేఫ్టీ లేని పాఠశాలలు**

**తమకేమీ పట్టని అధికారులు**




**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 25 ప్రభాత వార్త:** ప్రైవేటు పాఠశాలల నిర్వహణపై అధికార యంత్రాంగం పర్యవేక్షణ కొరవడింది.. పాఠశాలలకు అనుమతి లేకుండానే ఇప్పటిదాకా కొనసాగిస్తూ వచ్చారంటేనే అధికారుల నిర్లక్ష్యం అనుకోవాలా..వారి అండదండలు ఉన్నాయని అనుకోవాలా అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఆరంభంలోనే హడావిడి.. విద్యా వ్యవస్థ అకాడమిక్ సంవత్సరం ప్రారంభంలోనే స్కూల్ బస్సుల ఫిట్నెస్, పాఠశాల భవనాలకు ఫైర్ సేఫ్టీ తదితర విషయాలపై హడావిడి చేసే అధికారులు తదుపరి వాటి పర్యవేక్షణపై కనీసం శ్రద్ధఉంచడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన రెండు మూడు బస్సు ప్రమాద ఘటనలే ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఫిట్‌నెస్ లేని బస్సులను యధావిధిగా కొనసాగించడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా సగాని కంటే ఎక్కువ పాఠశాలలకు ఫైర్ సేఫ్టీ అనుమతి లేదు అంటే ఆశ్చర్యానికి గురికాక తప్పదు. మహబూబ్‌నగర్ పట్టణం నడిబొడ్డులోనే జాతీయ ప్రమాణాలతో అంటూ కార్పోరేట్ స్థాయిలో పాఠశాలలను ఏర్పాటు చేసి నేటికీ దర్జాగా కొనసాగిస్తున్నా అనుమతి ఇవ్వాల్సిన మండల విద్యాధికారి కానీ అప్రూవ్ చేయాల్సిన జిల్లా విద్యాశాఖ అధికారి కానీ వీటిపై ఇప్పటికీ స్పందించకపోవడం గమనార్హం. పాఠశాల విద్యపై ఉన్నత అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిలువెత్తు నిదర్శనంగా చెప్పవచ్చు. మహబూబ్‌నగర్ పట్టణంలో గీతం గ్లోబల్ స్కూల్, ఐఏఎఫ్ క్రియేటివ్ స్కూల్, సంస్కృతి విద్యాలయ, షం రాక్ స్కూల్, లొండా రాక్ పాఠశాలల పేరుతో 2025, 26 విద్యా సంవత్సరానికి గాను అనుమతి లేకుండానే అడ్మిషన్లు తీసుకొని తరగతులు కొనసాగిస్తున్నారు. అయితే ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి జనవరి నెల ముగుస్తున్న ఇప్పటికీ వాటికీ అనుమతి లేదు అంటే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మరి ఆ ఐదు పాఠశాలలలో సుమారు రెండువేల మంది దాకా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నట్లు సమాచారం. ఇదే విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ ను వివరణ కోరగా సదరు పాఠశాలలను మూసివేయాలని మండల విద్యాశాఖ అధికారికి ఆర్డర్ జారీ చేసిన నేటికీ అమలు కాకపోవడం గమనార్హం.

# మరో 10 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుంది

**గ్రామాల అభివృద్ధి**

**కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యం**

**20 లక్షల నిధులతో నూతన**

**గ్రామపంచాయతీకి శంకుస్థాపన**

**దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్**



రూ. 20 లక్షల నిధులతో నూతన గ్రామపంచాయతీకి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**దేవరకద్ర,జనవరి 25 ప్రభాతవార్త:** కాంగ్రెస్ తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని, మరో 10 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం కౌకుంట్ల మండలం వెంకటగిరి గ్రామంలో 20 లక్షల నిధులతో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్లు బిఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో ఒక ఇల్లు, ఒక రేషన్ కార్డు ఇవ్వలేదని, కేవలం అభివృద్ధి పనుల మాటున అందిన కాడికి దోచుకున్నారే తప్ప గ్రామాలను పట్టించుకోలేదని విమర్శించారు. నేడు ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం లాంటి అనేక పథకాలు చేపట్టి ప్రజలకు అందించామని అన్నారు. వీటితోపాటు విద్యాపరంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, వైద్యపరంగా నూతన ఆస్పత్రుల నిర్మాణం, గ్రామాలలో మౌలిక వసతుల కల్పన లాంటి అనేక పనులు చేశామన్నారు. మున్ముందు గ్రామానికి మరిన్ని నిధులు మంజూరు చేయించి, సంపూర్ణ అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని రాబోయే రోజుల్లో గ్రామాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. అదేవిధంగా వెంకటగిరి నుంచి వెంకంపల్లి వరకు మట్టి రోడ్డును బాగు చేసి, రైల్వే అండర్ బ్రిడ్జిని అధికారులతో మాట్లాడి త్వరగా పూర్తి చేస్తామన్నారు. అనంతరం పలువురికి కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, కురుమూర్తి చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, కిషన్ రావు, వెంకటగిరి గ్రామ సర్పంచ్ పొనకంటి లక్ష్మయ్య, గ్రామ అధ్యక్షులు పెబ్బేటి భీమ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకట్ రెడ్డి, కౌకుంట్ల మండల జనరల్ సెక్రెటరీ పెబ్బేటి గోవర్ధన్ రెడ్డి, రామ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వివిధ గ్రామాల నూతన సర్పంచ్లు, ఎంపీడీవో శివప్రసాద్, కౌకుంట్ల మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు, కౌకుంట్ల శ్రీనివాసరెడ్డి, బడుగుల విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటగిరి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో విద్య,వైద్యానికి పెద్దపీట

**250 కోట్లతో ఇంటిగ్రేటెడ్**

**పాఠశాలకు భూమి పూజ**

**అన్ని వర్గాల విద్యార్థులకు విద్యను**

**అందిస్తాం : మంత్రి వాకిటి శ్రీహరి**



భూమిపూజ చేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్ టౌన్,జనవరి 25 ప్రభాతవార్త :** రాష్ట్రంలో విద్య, వైద్యానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలంగాణ రాష్ట్ర క్రీడలు,మత్స్య శాఖ, యువజన, పాడి పరిశ్రమ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.ఆదివారం మక్తల్ నియోజకవర్గం గొల్లపల్లి గ్రామం వద్ద 250 కోట్లతో 25 ఎకరాల స్థలంలో నూతన హంగులతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. భవిష్యత్తులో ఇబ్బంది లేకుండా అన్ని వర్గాల విద్యార్థులకు విద్యను ఒకేచోట నేర్పించి యువతను విద్యావంతులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విద్య, వైద్యానికి అత్యంత ప్రాముఖ్యత ఇస్తున్నట్టు తెలిపారు. అనంతరం సురేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థకు ఊపిరి లాంటిదన్నారు.18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో సెట్విన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌ను ఆయన -మిగతా4లో..

# ఓటు హక్కును వినియోగించుకోవడం పౌరులందరి బాధ్యత



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు

**గద్వాల జనవరి 25, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య దేశంలో 18 సంవత్సరాలు నిండితే ఓటరుగా నమోదు కాబడి, ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవడం పౌరులందరి బాధ్యత అని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం ఐడిఓసి ఆవరణలో ఓటరు దినోత్సవ ర్యాలీని అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. పౌరులు, వివిధ శాఖల అధికారులతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఓటు ప్రాధాన్యతను తెలియజేసే ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టరేట్ నుంచి రైల్వే ఫైవంతెన మీదుగా అంబేద్కర్‌చౌరస్తా అనంతరం కృష్ణవేణి చౌరస్తా వరకు ర్యాలీ చేరుకున్నాక అదనపు కలెక్టర్ ప్రసంగించారు. 1950 జనవరి 26న గణతంత్ర దేశంగా ఆవిర్భవించిన తర్వాత ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి పౌరులందరికీ ఓటు హక్కును కల్పించడం జరిగిందన్నారు. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు కలిగిన, వివిధ వర్గాల ప్రజలతో వైవిధ్య భరితంగా ఉన్న మన దేశంలో దశాబ్దాలుగా ప్రజాస్వామ్య మనుగడకు ఓటు హక్కు కీలకంగా నిలుస్తోందన్నారు. ఓటరు దినోత్సవంతో యువత పెద్ద ఎత్తున ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవడానికి, ఓటు హక్కు విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవడానికి ఆస్కారం ఉందన్నారు. ఎన్నికల సమయంలో గ్రామీణ ప్రాంత ఓటర్లలో ఉన్నంత చైతన్యం నగర ప్రాంత వాసుల్లో లేకపోవడం బాధాకరమన్నారు. ఏ ఎన్నికల్లోనైనా ఓటింగ్ శాతం పెరగాలంటే ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు వేయడం అనేది ఎంతో ముఖ్యమని,మంచివారిని మన ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవడానికి అవకాశం ఉందన్నారు. ప్రజలకు సేవ చేసే అదృష్టం ఎవరికైనా ఉంటుందని యువత పెద్దఎత్తున ఎన్నికల్లో పోటీచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాజకీయం అంటే చాలామంది మనకెందుకని వెనకడుగు వేస్తుంటారని, కొంతమంది ఎన్నికల్లో పోటీ చేయ డానికి డబ్బు లేదని కారణాలు చెబుతుంటారని, మంచి వాళ్ళు ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యేలా బాధ్యత కలిగిన పౌరులందరూ ఎన్నికల విధానం లో పాలుపంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఓటు హక్కుతో ప్రజాస్వామ్యయుతంగా ప్రభుత్వాలను ఎన్నుకోవడం మనకెంతో గర్వకారణమని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో రాష్ట్రంలోనే మన జిల్లా అత్యధిక ఓటింగ్ శాతంతో టాప్ 5లో నిలిచిందన్నారు. ఇదే స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికల్లోను ప్రతి ఓటరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం అధికారులు ర్యాలీలో పాల్గొన్న వారందరితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి రమేష్ బాబు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా, డివైఎస్ఓ కృష్ణయ్య, గద్వాల తహసిల్దార్ మల్లికార్జున్, ఇతర అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



మృతి చెందిన చిన్నారులు, రోదిస్తున్న కుటుంబ సభ్యులు

## ఆ తల్లి రోదన
# వర్ణనాతీతం

**- ముచ్చర్లపల్లిలో విషాదఛాయలు...**

**- వ్యవసాయ కుంటలో పడి ముగ్గురు విద్యార్థుల మృతి**

**ఊర్కొండ, జనవరి 25 ప్రభాతవార్త:** నవ మాసాలు మోసి కంటికి రెప్పలా కాపాడుకొని తమ పిల్లల జీవితాలలో వెలుగును నింపి ప్రయోజకులను చేయాలనే లక్ష్యంతో ఏ కష్టం తెలవకుండా అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న పిల్లలు కళ్ళముందే విఘాత జీవులుగా పడి ఉండడం చూసిన ఆ తల్లి రోదన వర్ణనాతీతం. ముగ్గురు పిల్లలు ఒకేసారి విగాత జీవులుగా మారడంతో ఇంకా మేము ఎవరి కోసం బ్రతకాలి మాకు ఈ కష్టం ఎందుకు ఇచ్చావు దేవుడా అంటూ విలపిస్తుండడంతో ఆ తల్లిదండ్రుల రోధన పలువురిని కంటతడి పెట్టించాయి. ఇదంతా నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల పరిధిలోని ముచ్చర్లపల్లి గ్రామంలో ఆదివారం అత్యంత విషాదకర సంఘటన చోటుచేసుకుంది. సాగునీటి కోసం పొలంలో తవ్విన కుంటలో పడి ముగ్గురు విద్యార్థులు మృత్యువాత పడ్డారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో గ్రామంలో శోకసంద్రం నెలకొంది. స్థానికులు తెలిపిన -మిగతా4లో..



ఓటరు ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

## ఓటుతోనే
# ప్రజాస్వామ్యం పటిష్టం

**అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటర్ గా నమోదు చేసుకోవాలి**

**జిల్లాలో 7,38,551 ఓటర్ల నమోదు**

**జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**

**16వ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా యువ ఓటర్, దివ్యాంగ, వృద్ధ ఓటర్‌లకు సన్మానం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 25, ప్రభాతవార్త:** ప్రతి ఓటర్ ఎన్నికల్లోఓటు హక్కు వినియోగించుకోవాలని, ఓటు వినియోగంతోనే ప్రజాస్వామ్యం పటిష్టం అవుతుందని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో 16వ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో యువ, వికలాంగ, వృద్ధ ఓటర్లను కలెక్టర్ సన్మానం చేశారు.16 వ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉపన్యాసం, వక్తృత్వ పోటీలలో విజేతలైన విద్యార్థిని,విద్యార్థులకు సర్టిఫికెట్ ,బహుమతి -మిగతా4లో..



షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

# పదేళ్లలో ఒక్క షెడ్ నిర్మించలె

**ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి**

**జడ్చర్ల మార్కెట్ లో రూ.1.75 కోట్లతో నూతన**

**షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన**

**జడ్చర్ల,జనవరి 25 ప్రభాతవార్త:** గత పది సంవత్సరాలలో జడ్చర్ల మార్కెట్లో ఒక్క షెడ్‌అయిన నిర్మాణం చేయలేదని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి పేర్కొన్నారు. జడ్చర్ల మున్సిపాలిటీలోని వ్యవసాయ మార్కెట్‌లో రూ.1.76 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న షెడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జడ్చర్లకు రావాల్సిన సుమారు రూ.30 కోట్ల మూడా నిధులను సంతకం చేసి మహబూబ్‌నగర్‌కు మళ్లించారని -మిగతా4లో..

## ఎరువుల బస్తాలను ధ్వంసం చేసిన దుండగులు

**బిజినేపల్లి, జనవరి 25 ప్రభాతవార్త:** పాలెం గ్రామ సమీపంలోని వ్యవసాయ పంట పొలాల్లో దాదాపు రూ. 50 వేలు విలువచేసే ఎరువుల బస్తాలను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు వేమిరెడ్డి బాపురెడ్డి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుంటాడు. ఇంటి నుండి ఎరువుల బస్తాలను తీసుకెళ్ళేందుకు ఇబ్బందిగా మారడంతో పంట పొలాల వద్ద దాదాపు 50 బస్తాల ఎరువును దాచి ఉంచినట్లు వివరించారు. గుర్తు తెలియని దుండగులు 27 బస్తాల డిఏపి, 20 బస్తాల యూరియాను దమ్ము చేసిన పొలంతో పాటు పంట కాలువల్లో శనివారం రాత్రి పారబోసినట్లు వివరించారు. జరిగిన ఈ సంఘటనను చూసి తోటి రైతులు ఎరువుల కోసం రైతన్నలు ఇబ్బంది పడుతున్న తరుణంలో ఇలాంటి ఘటనకు పాల్పడడం బాధాకరమని వివరించారు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు వివరించాడు.



పంట పొలాల్లో పారబోసిన ఎరువుల బస్తాలు

## వెల్టూర్‌లో ఘనంగా పల్లకి సేవ ఊరేగింపు

**ఉప్పునుంతల, జనవరి 25 ప్రభాతవార్త :** రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని వెల్టూరు గ్రామంలో శ్రీ అలివేలు మంగ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజైన ఆదివారం ఘనంగా పల్లకి సేవ ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్ సమక్షంలో ఆలయ కమిటీ చైర్మన్ కూచు కుళ్ళ పద్మనాభ రెడ్డి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాయి. అదేవిధంగా ఆదివారం రాత్రి ఘనంగా కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. నేడు సోమవారం ఘనంగా జన సామూహం మధ్య కేరింతలతో రథోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వెల్టూర్ లో ఘనంగా పల్లకి సేవ ఊరేగింపు

## లైన్స్ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**మక్తల్ టౌన్, జనవరి 25 ప్రభాతవార్త :** లయన్స్ క్లబ్ ఆఫ్ మక్తల్ భీమా ఎం.కె సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మహబూబ్‌నగర్ వారి అధ్వర్యంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ సత్య ఆంజనేయులు అధ్యక్షతన ప్రోగ్రాం చైర్మెన్ లయన్ రమేష్ రావ్ ఆధ్వర్యంలో జక్లేర్ గ్రామంలో డా. మహేష్ కుమార్ ఎంబిబిఎస్, ఎమ్మెస్ వారి బృందం దాదాపు600మందికి ఉచిత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు సిరప్‌లు ఇవ్వడం జరిగింది.కార్యక్రమంలో జక్లేర్ గ్రామ సర్పంచ్ నిర్మలబాయ్, మాధవ రావు,గ్రామ పెద్దలు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహులు ఎంకె హాస్పిటల్ సిబ్బంది 12 మంది లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు కొండయ్య, ట్రెజరర్ ఆదేం సత్యనారాయణ, అనుగొండ శ్రీనివాసులు, ఎస్.రమేష్ రావు, విరేశం, తంగిడి నాగరాజు, గవినోళ్ల జైపాల్‌రెడ్డి, పృథ్వీ రాజ్, బి.అంబాదాసరావు, రవికుమార్ గౌడ్, డా. విక్రమ్ భార్గవ్ రాణా,రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

## జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా సైకిల్ ర్యాలీ

**ధన్వాడ, జనవరి 25 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ధన్వాడలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ధన్వాడలో తహసీల్దార్ సింధూజ ఆధ్వర్యంలో స్థానిక పురవీధుల గుండా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి, యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఎంతో విలువైనదని, ప్రతి ఓటు భవిష్యత్ పాలనను నిర్ణయిస్తుందని తెలిపారు. యువత రాజకీయ అవగాహన పెంచుకొని చైతన్యవంతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు రామచంద్రయ్య, కూరగాయల రామచంద్రయ్య, గిర్దావర్ శ్రీనివాసులు, జీపీవో భాస్కర్, సురేష్‌తో పాటు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీకి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది.



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## ఉప్పరపల్లి , లక్ష్మాపూర్ మార్గం పరిశీలన

### ఎన్నారై అడ్వైజర్ బొజ్జ అమరేందర్ రెడ్డి

**ఉప్పునుంతల, జనవరి 25 ప్రభాతవార్త :** మండలంలోని ఉప్పరపల్లి గ్రామం నుంచి లక్ష్మాపూర్ వెళ్లే మార్గం పూర్తిగా దెబ్బతిందని, సత్వరమే అధికారులు స్పందించి రోడ్డు మార్గం బాగు చేయాలని ఎన్నారై అడ్వైజర్ బొజ్జ అమరేందర్ రెడ్డి అధికారులను కోరారు. ఆదివారం ఆయన దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ మార్గంలో ఉన్న రైతులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని, ఈ మార్గానికి మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కాలువ పై భాగంలో పారుతుండడంతో కెఎల్ఐ కాలువ లీకేజీలతో నీరంతా వృధాగా పంట పొలాల్లో పొంగి పొర్లుతుండడతో ఇటీవల ఇరిగేషన్ అధికారులు పరిశీలించి వృధాగా వెళుతున్న నీటిని ఆపేయడంతో దెబ్బతిన్న ప్రాంతాన్ని ఎన్నారై అడ్వైజర్ బొజ్జ అమరేందర్ రెడ్డి పరిశీలించారు. సత్వరమే ఈ మార్గాన్ని రైతులకు అనుగుణంగా బాగు చేయాలని ఆయన కోరారు.



దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎన్ఆర్ఐ అడ్వైజర్ బొజ్జ అమరేందర్ రెడ్డి

## గ్రామాభివృద్ధికి కొత్త దిశ చూపనున్న ప్రజాప్రతినిధికి ఘన సన్మానం

**దామరగిద్ద, జనవరి 25 ప్రభాతవార్త :** మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో దామరగిద్ద గ్రామ పంచాయతీ సర్పంచిగా ఎన్నికైన అద్దన్ కనికి రెడ్డిని ఘనంగా సన్మానించడం జరిగింది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజల విశ్వాసాన్ని పొంది విజయాన్ని సాధించిన ఆయనను గౌరవించడం ద్వారా ప్రజాసేవలో ఉన్న బాధ్యతను మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిలిచింది. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వ్యవస్థ ప్రజాస్వామ్యానికి పునాది వంటిదని, గ్రామాభివృద్ధిలో సర్పంచ్ పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. అద్దన్ కనికి రెడ్డి గ్రామ ప్రజల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారదర్శక పాలనతో పాటు సమగ్ర గ్రామ వికాసానికి కృషి చేస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. మున్నూరు కాపు సమాజానికి చెందిన ప్రజాప్రతినిధులు సమాజ గౌరవాన్ని కాపాడుతూ ప్రజల ఆశలను నెరవేర్చాలని ఆకాంక్షి ంచారు. సర్పంచ్ అద్దన్ కనికి రెడ్డి మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, గ్రామాభివృద్ధే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తానని ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఎప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు.



దామరగిద్ద గ్రామ పంచాయతీ సర్పంచిగా ఎన్నికైన అద్దన్ కనికి రెడ్డిని ఘనంగా సన్మానిస్తున్న దృశ్యం

## కాంగ్రెస్ హయాంలోనే రైతులకు గిట్టుబాటు

### మార్కెట్ చైర్మన్ అంతటి రజిత మల్లేష్

**ఉప్పునుంతల, జనవరి 25 ప్రభాతవార్త :** అన్నమో రామచంద్ర అంటూ వేడుకున్న కరుణించని ప్రభుత్వాలలో రైతాంగం ఎదుర్కొన్న ఇబ్బందులు అంతా ఇంతా కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించిన ఘనత సిఎం రేవంత్ రెడ్డి కి దక్కిందని అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్ ఉన్నారు. ఆదివారం వేరుశనగ కు మార్కెట్ లో అత్యధికంగా రూ. 11 వేల 877ల ధర పలికిందని దీంతో రైతుల కళ్ళల్లో ఆనందం వెల్లివిరిచిందన్నారు. పోరాడే సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మూడో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బాధ్యతలు వెంటనే రైతుల పట్ల ప్రత్యేక దృష్టిసారించి రైతు సంక్షేమ కాంగ్రెస్ ప్రభుత్వం అని రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని చైర్మన్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత పాలకుల రెండు పర్యాయల సమయంలో రైతాంగం ఎంతో ఇబ్బంది ఎదుర్కొన్నారని, అందించిన పంటను మార్కెట్ కు తీసుకొస్తే గిట్టుబాటు ధర కల్పించకుండా చేతులెత్తేసిన ఘనత గత పాలకులకు దక్కిందన్నారు. ఈసారి యాసంగి పంటలో సాగు చేసుకున్న రైతాంగం వేరుశనగ పంటను పండించి మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతాంగం వారి ఆనందాలకు వర్ణాతీతం చెప్పవచ్చు. ఎలాంటి ఇబ్బందులు కలవకుండా మార్కెటింగ్ చేయడం పట్ల రైతులు ఎంతో అభినంద నీయంగా ఉన్నారని, ఈ దఫా రైతులకు మద్దతు ధర కల్పించడంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సహకారం పూర్తిస్థాయిలో ఉందని రైతులు మార్కెట్ తీసుకువచ్చే ధాన్యాన్ని నాణ్యతగా తీసుకొచ్చి గిట్టుబాటు ధర పొందాలని చైర్మన్ అంతటి రజిత మల్లేష్ లు కోరారు. చైర్మన్ తో పాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి నరసింహులు, డైరెక్టర్లు, రైతులు ఉన్నారు.



వేరుశనగ పంట నాణ్యతను పరిశీలిస్తున్న చైర్మన్, అధికారులు

## కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

**ఆత్మకూర్ జనవరి 25,ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా కేవలం నిర్మాణరంగా కార్మికులకే కాకుండా అసంఘటితరంగా కార్మికులకు సైతం ప్రభుత్వం సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని పియుసిపి జిల్లా అధ్యక్షులు ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని మార్కెట్ యార్డు కార్యాలయంలో జరిగిన ఆత్మకూరు మండల పెయింటర్స్ కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసిన అనంతరం ఆయన కార్మికులను దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ అధికారులు నిజమైన కార్మికులకు లేబర్ కార్డులతో పాటుగా గుర్తింపు కార్డులను సరఫరా చేయడంలో పూర్తిగా విఫ్లమవుతున్నారని తద్వారా నిజమైన కార్మికులు ప్రభుత్వం అందజేయబడే సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లారు లేబర్ అధికారులు గుర్తింపు కార్డులు జారీ చేసే విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని లేనిపక్షంలో కార్మికుల నష్టపోయే ప్రమాదం ఏర్పడుతుందని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా అసంఘటిత రంగ కార్మికులను మరింత అసంఘటిత పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టడం బాధాకరమని అందులో భాగంగానే లేబర్ కోర్సును తెచ్చి కార్మికుల పాలిట శాపంగా మార్చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం లేబర్ కోర్లను రద్దుచేసి కార్మికులకు చట్టపరమైన పథకాలు వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకోవాలని అంతేకాకుండా నిర్మాణరంగంలో పనిచేస్తున్న కార్మికులకు వైద్య సదుపాయానికి సంబంధించి ఏజెన్సీలను నియమించడం విరమించుకోవాలని కార్మికులకు నేరుగా కార్పొరేట్ ఆసుపత్రి స్థాయిలో వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు... అనంతరం ఆత్మకూరు మండల పెయింటర్ సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఆత్మకూరు మండల పెయింటర్ సంఘం అధ్యక్షులుగా యూసుఫ్ గౌరవ అధ్యక్షులుగా చిన్న పరమేష్ ఉపాధ్యక్షులుగా సిద్దు ప్రధాన కార్యదర్శిగా రవి గౌడ్ కోశాధికారిగా నరేష్ తదితరులతో పాటుగా 13 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్ల ఆయన తెలిపారు.



మార్కెట్ యార్డ్ కార్యాలయ ఆవరణలో కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రసాద్

## ప్రారంభమైన శ్రీ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు

**గద్వాల జనవరి 25, ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గం ధరూర్ మండలం పెద్ద చింత రేవుల గ్రామంలో శ్రీశ్రీ ఆంజనేయ స్వామి వారి బ్రహ్మోత్సవాలకు బిఆర్ యస్ పార్టీ గద్వాల నియోజక వర్గ ఇంచార్జ్ బాసు హనుమంతు నాయుడు హాజరయ్యారు.ఈ బ్రహ్మోత్సవాల ప్రారంభ అనంతరం శ్రీశ్రీ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...శ్రీ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొన్నదన్నారు. ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా శ్రీ అంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందన్నారు.శ్రీఆంజనేయ స్వామి ఆశీస్సులతో నియోజకవర్గ , పెద్ద చింత రేవుల గ్రామం ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో, పాడిపంటలతో,సుఖ సంతోషంగా ఉండాలని వారు ఆకాంక్షి ంచారు.ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జి.రాఘవేంద్ర రెడ్డి,అల్లాపాడు ప్రతాప్, బీచుపల్లి,మునిరెడ్డి,వెంకటేష్‌నాయుడు,చక్రిధర్ రెడ్డి,పూడూరు ఈశ్వర్, జాంపల్లి భరత్ , సింహారెడ్డి, తిమ్మప్ప గౌడ్,ముని మోర్య,పూడూరు రఘు నాయుడు,ద్యాంశీను,ఆంజనేయులు,లక్ష్మారెడ్డి,ఆనంద్,రాముడు,ధరూర్ రాము,రమేష్, నరసింహులు,రవి,వీరేష్,కృష్ణ,రాజు,మోహన్, నాగరాజు,వెంకటేష్,నరసింహా,గోవిందు,ప్రహ్లాద్,రాముడు, పార్టీ నాయకులు,కార్యకర్తలు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీ ఆంజనేయ స్వామి వారినీ దర్శించుకుంటున్న బాసు హనుమంతు నాయుడు

## పురాతన ఆలయాలను కాపాడుకుందాం

### విహెచ్‌పి జిల్లా అధ్యక్షులు మద్ది యాదిరెడ్డి

**చిన్న చింతకుంట, జనవరి 25 ప్రభాతవార్త :** హిందూ ధర్మాన్ని ఆచరిస్తూ దృఢ సంకల్పంతో పురాతన దేవాలయాలను కాపాడుకుంటూనే ధర్మాన్ని రక్షించుకుంటూ హిందువులందరూ ఏకతాటిపై ఉండాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు మద్ది యాదిరెడ్డి తెలిపారు. ఆదివారం అనంతగిరి వెంకటేశ్వర స్వామి ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావాలన్న సంకల్పంతో లక్ష్మీదేవి పూర్ సమీపంలోని పల్లెగుట్ట శుద్ధి కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజ, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షి ంచుకునే బాధ్యత ప్రతి హిందువుపై ఉందన్నారు. రథసప్తమి పర్వదినం రోజున ప్రతి హిందువు అనంతగిరి వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు అవుతామని సంకల్పం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శృంగేరి పీఠం బాలకవి బ్రహ్మశ్రీ చిరంజీవి ధీరజ్ తన ఆధ్యాత్మిక ఉపన్యాసంతో భక్తులను మంత్రముగ్ధులను చేశారు. హిందూ దేవాలయాలను రక్షించుకునే బాధ్యత ప్రతి హిందువుపై ఉందన్నారు. హిందూ ధర్మాన్ని అవహేళన చేసే వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. అనంత వెంకటేశ్వర స్వామి వచ్చే రథసప్తమి నాటికి ఆలయ నిర్మాణం జరిగేలా ప్రతి హిందువు కంకణబద్ధులై పని చేయాలని ఆయన తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. విశ్వహిందూ పరిషత్ పాలమూరు శాఖ తరపున ఆలయ నిర్మాణానికి లక్ష 116 రూపాయలను విరాళంగా అందజేయనున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు యాదిరెడ్డి ప్రకటించారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి నాగరాజు, విహెచ్ పి నాయకులు రాచాల జనార్ధన్, విగ్నేష్, శివయ్య, శంకరయ్య, శ్రీనివాస్ ,కురువ రమేష్, గుల్లకుంట బోజ్జన్న, మున్నెప్ప, మధు, యువత, మహిళలు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న వి హెచ్ పి జిల్లా అధ్యక్షులు యాదిరెడ్డి

## ద్వాదశ జ్యోతిర్లింగాల మహా పడిపూజ

**దేవరకద్ర,జనవరి 25 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలోని స్థానిక శివాలయం దగ్గర జ్యోతిర్లింగాల మహా పడి పూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. మొదట పూజా కార్యక్రమంలో అఖండ దీపారాధన, గోత్రనామాలతో సంకల్పము కలశపూజ, గణపతి పూజ చేశారు. ఒక్కొక్క జ్యోతిర్లింగానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి,అభిషేక అనంతరము బిల్వాష్టకము, శివాష్టకము, లింగాష్టకము, శరణు ఘోష శివగోష స్వామివారికి మహా నైవేద్యం,మహా మంగళహారతి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి గోపన్‌పల్లి,పుట్టపల్లి, రాజోలి, ఇస్రంపల్లి , వెంకటగిరి,వెంకంపల్లి, పేరూరు గ్రామాల నుండి దాదాపు 150 మంది శివ స్వాములు పాల్గొన్నారు .శివ స్వాములకు బిక్ష అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శివాలయ ప్రాంగణమం తా భజన కార్యక్రమంతో మార్మోగింది. తెల్లవారుజా మున పార్వతి పరమేశ్వర స్వామి పల్లకి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలందరూ ఎల్లవేళలా ఆయురారోగ్యాలను ప్రసాదించి, గ్రామాన్ని మమ్ములను కాపాడాలని గ్రామ ప్రజల సంకల్పం మేరకు గోపన్ పల్లి మఠం సురేష్ స్వామి ఆధ్వర్యంలో శాస్త్ర పద్ధతిగా పూజా కార్యక్రమాలను నిర్వహించి గ్రామ భక్తాదులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చెన్నకేశవ స్వామి భజన మండలి సభ్యులు శివాలయం చైర్మన్, సిబ్బంది, శివ స్వాములు, గ్రామ మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి అభిషేకాలు చేస్తున్న శివస్వాములు



పడిపూజలో పాల్గొన్న శివస్వాములు

### ఓటర్ల దినోత్సవం సందర్భంగా

## అవగాహన ర్యాలీ

### ఉత్తమ ఎన్నికల నిర్వహణ పురస్కారం అందుకున్న తహసిల్దార్



కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న తహసీల్దార్

**శ్రీరంగాపూర్,జనవరి 25 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో ఆదివారం 16 వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శ్రీరంగాపూర్ తహసిల్దార్ రాజు ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీని యువకులు నాయకులు గ్రామ ప్రజల అందరితో కలిసి తహసిల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ చేయడం జరిగింది. తదనంతరం వనపర్తి కలెక్టర్ కార్యాలయం నందు కలెక్టర్ ఆదర్శ్ సురభి చేతుల మీదుగా ఉత్తమ ఎన్నికల నిర్వహణ పురస్కారం అందుకోవడం జరిగింది.

### మన్‌కీ బాత్ కార్యక్రమంలో

## పాల్గొన్న బిజెపి నాయకులు



మన్‌కీ బాత్ కార్యక్రమంలో బిజెపి నాయకులు

**జడ్చర్ల,జనవరి 25 ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ జడ్చర్ల మండల్ శాఖ గోప్లపూర్ గ్రామంలో 130వ మన్‌కి బాత్ ఎపిసోడ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం మండల ఉపాధ్యక్షులు కాశన్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని వీక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు యట రామకృష్ణ ముదిరాజ్, మండల ఇంఛార్జ్ సామల నర్సింహులు, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మురళి, మండల ప్రధాన కార్యదర్శి ఎడ్ల శ్రీనివాస్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు మహేష్‌యాదవ్,ఓబిసి మండలఅధ్యక్షులు కుమార్ యాదవ్, మండలకార్యదర్శి ఈశ్వర్,గోపులాపూర్ బూత్ అధ్యక్షులు యాదగిరి, ధనుంజయ్, గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గురుకుల మాదిరి పరీక్ష విజయవంతం

**ఆత్మకూర్ జనవరి 25, ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన గురుకుల మాధురి పరీక్ష విజయవంతంగా కొనసాగిందని నిర్వాహకులు మీర్జా అన్వర్ బేగ్ ప్రభాతవార్తకు తెలిపారు. ఫిబ్రవరిలో కొనసాగే గురుకుల ప్రవేశ పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లిటిల్ ఫ్లవర్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి మాదిరి పరీక్షకు 72 మంది విద్యార్థులు హాజరు కాగా అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు ఉచిత మెటీరియల్ పంపిణీ చేసినట్లుగా ఆయన తెలిపారు..

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మెగావత్ రాములు

**బిజినేపల్లి, జనవరి 25 ప్రభాతవార్త:** నల్లవాగు సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. తాడూరు మండలం పర్వతాయపల్లి తండాకు చెందిన మెగావత్ రాములు (43) సొంత పనుల పై బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీ కొట్టి తీవ్ర గాయాల పాలు కాగా నాగర్ కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. రోడ్డు పక్కనుండి నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మృతుడికి భార్య సాలెమ్మ ఇద్దరు కొడుకులు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రెండవ ఎస్సై సుబ్బరాజు వివరించారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు

## ఆత్మకూరు విద్యార్థినుల ఎంపిక



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

**ఆత్మకూర్ జనవరి 25, ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణానికి చెందిన విద్యార్థినిలు కావ్య, బిందు, సహస్ర, చంద్రిక తదితరులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లుగా ఆత్మకూర్ వాలీబాల్ కోచ్ ఖాదర్ విలేకరులకు తెలిపారు. మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని ఎంపికైన విద్యార్థులు ఫిబ్రవరి 6,7,8 తేదీలలో జరగనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడల్లో పాల్గొన్నట్లుగా ఆయన తెలిపారు. ఆత్మకూరు పట్టణం నుండి నలుగురు విద్యార్థులు వాలీబాల్ పోటీలకు ఎంపిక ఇవ్వడం పట్ల పట్టణానికి చెందిన ప్రముఖులు తదితరులు క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

## యాదవుల అభివృద్ధి కోసం ఎల్లవేళలా కృషి

**త్వరలోనే పట్టణంలో శ్రీకృష్ణ ఆలయ నిర్మాణం:ఎమ్మెల్యే**

**వనపర్తి ప్రతినిధి, జనవరి 25 ప్రభాతవార్త :** యాదవుల అభివృద్ధి కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని త్వరలోనే వనపర్తి పట్టణ నడిబొడ్డున శ్రీకృష్ణ ఆలయ నిర్మాణం చేపట్టేందుకు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జంగిడిపురం లోని యాదవ కమ్యూనిటీ హాల్ కు సంబంధించి పై అంతస్తు నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రత్యేక నిధుల నుంచి రూ. 10 లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గ పరిధిలోని యాదవుల అభివృద్ధి కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి గొల్ల వెంకటయ్య, న్యాయవాది మోహన్ యాదవ్, వనపర్తి పట్టణ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, కౌన్సిలర్లు ఎల్ఐసి కృష్ణ, నక్క రాములు, జంపన్న, రవి యాదవ్, నాగేంద్ర యాదవ్, రాముడు యాదవ్, యాదవ కమ్యూనిటీ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



యాదవ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే

## ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు చేసుకోవాలి

**ఇంచార్జ్ తహసీల్దార్ ఆంజనేయులు**

**దేవరకద్ర,జనవరి 25 ప్రభాతవార్త:** ప్రతి ఓటర్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఓటు వినియోగంతోనే ప్రజాస్వామ్యం పటిష్టమవుతుందని ఇంఛార్జి తాహసిల్దార్ ఆంజనేయులు అన్నారు. ఆదివారం కౌకుంట్ల మండల కేంద్రంలో 16వ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ర్యాలీగా నిర్వహించి ,ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఇంఛార్జి తహసిల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, ఏడాదిలో మూడు సార్లు నమోదు చేసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఓటు నోట్లతో కాకుండా అవినీతికి తావివ్వకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. జాతీయ ఎన్నికల కమిషనర్ రాష్ట్ర ఎన్నికల సంఘం పిలుపుమేరకు నా భారతదేశం నా ఓటు అనే అంశంతో జాతీయ ఓటర్ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు, తహసిల్దార్ సిబ్బంది, కౌకుంట్ల మండల యువకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

## నేడు వ్యవసాయ మార్కెట్ కార్మికులకు దుస్తుల పంపిణీ

**ఏఎంసి చైర్మన్ రాంపురంశివారెడ్డి**

**నారాయణపేట, జనవరి 25 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కేంద్రంలోఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డి ఆదేశాల మేరకు నిత్యం పేట వ్యవసాయ మార్కెట్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు యూనిఫామ్ దుస్తులు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఎంసి చైర్మన్ రాంపురం శివారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ డైరెక్టర్, మాజీ డీసీసీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి పాల్గొననున్నారు అన్ని పేర్కొన్నారు. మార్కెట్‌లో పనిచేస్తున్న దడ్వాయిలు, హమాలీలు, చాట కూలీలు అందరూ పాల్గొని ఈ చిన్న కానుకను స్వీకరించవలసిందిగా కోరారు. అలాగే ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కోణంగేరి హనుమంతు, మార్కెట్ డైరెక్టర్లు, మార్కెట్ సిబ్బంది, మార్కెట్ వ్యాపారస్తులు, నారాయణపేట నియోజకవర్గ సర్పంచులు, ఉప సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొని కార్మికులను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.



## ముచ్చర్లపల్లి ఘటనపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దిగ్భ్రాంతి

**కల్వకుర్తి ఆస్పత్రి వద్ద బాధిత కుటుంబాలకు పరామర్శ**

**ప్రమాదకర గుంతల వద్ద భద్రతా చర్యలు అవసరమని అధికారులకు సూచనలు**

**కల్వకుర్తి, జనవరి 25 ప్రభాతవార్త:** ముచ్చర్లపల్లి చిన్నారుల మృతి పట్ల జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఊర్కొండ మండలంలోని ముచ్చర్లపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెడ్డి కుమార్తె, కుమారుడు, సోదరి కుమార్తె పొలం వద్ద సెల్ఫీ దిగుతుండగా ప్రమాదవశాత్తు గుంతలో పడి మృతి చెందడం అత్యంత దురదృష్టకరమని శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని చిన్నారుల మృతదేహాలను సందర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం నింపారు. గ్రామాల్లో ఉన్న ప్రమాదకర గుంతలు, బావులు, చెరువుల వద్ద తగిన భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

## నిజాలను నిర్భయంగా రాసే పత్రిక వార్త

**కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి**

**దేవరకద్ర,జనవరి 25 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తూ, నిజాలను నిక్కసిగా రాస్తున్న పత్రిక వార్త దినపత్రిక అని కౌకుంట్ల మండల అధ్యక్షులు ఎం. రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఇస్రంపల్లి గ్రామంలో 2026 వార్త క్యాలెండర్ ను రాఘవేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ కృష్ణయ్య యాదవ్, ఉపసర్పంచ్ సలాం కలిసి వార్త క్యాలెండర్‌ను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ వార్త జర్నలిస్టులందరూ నిజాలను నిక్కసిగా రాస్తూ, ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ, ప్రజా సమస్యలను ఇప్పటికప్పుడు తమ దృష్టికి వార్తాపరంగా తీసుకొస్తూ, సమాజానికి ఉపయోగపడే విధంగా వార్తలు రాస్తున్న వార్తా పత్రికకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తీర్చడమే తమ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, పెంటన్న, రాకేష్, గ్రామ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



వార్త దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

## మహమ్మద్ సత్తార్ ఆశిక్‌కు
## ఏపీజే అబ్దుల్ కలాం టాలెంట్ బెస్ట్ అవార్డు

**జడ్చర్ల, జనవరి 25 ప్రభాతవార్త:** ఏతేమాద్ పత్రికకు చెందిన జడ్చర్ల రిపోర్టర్ మహమ్మద్ సత్తార్ ఆశిక్ ను ఏపీ జే అబ్దుల్ కలాం టాలెంట్ బెస్ట్ అవార్డు వరించింది. 2026తో సత్కరించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ ఆడిటోరియంలో మెమెంటో అందజేసి సన్మానించారు. ఏపీజే అబ్దుల్ కలాం రూరల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు సయ్యద్ షెరైన్ సుల్తానా మహమ్మద్ సత్తార్ ఆశిక్‌కు అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ ఖర్జ్ ఖాన్ (సీనియర్ కాంగ్రెస్ నాయకులు)తో పాటు పలువురు రాజకీయ, సామాజిక, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహమ్మద్ సత్తార్ ఆశిక్ ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకొస్తూ నిజాయితీతో జర్నలిజం చేస్తున్నారని ప్రశంసించారు.అవార్డు అందుకున్న అనంతరం మహమ్మద్ సత్తార్ మాట్లాడుతూ ఈ గౌరవం తనకు మరింత బాధ్యతతో ప్రజాసేవ చేయడానికి ప్రోత్సాహం ఇస్తుందని తెలిపారు.



ఏపీజే అబ్దుల్ కలాం టాలెంట్ బెస్ట్ అవార్డు అందుకుంటున్న జడ్చర్ల రిపోర్టర్ మహమ్మద్ సత్తార్ ఆశిక్

# వైభవంగా రథసప్తమి వేడుకలు

**వెంకన్న దర్శనంలో పోటెత్తిన భక్తజనం**

**భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు**

**బిజినేపల్లి, జనవరి 25 ప్రభాతవార్త:** పాలెం వెంకటేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు వైభవంగా భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. మాఘ శుద్ధ సప్తమి నాడు సూర్య జయంతిగా (రథసప్తమి) భక్తిశ్రద్ధల తో జరుపుకుంటారు. అలివేలు మంగ సమేత స్వామి ఆలయంలో ఉదయం నిత్యారాధన ప్రబంధ పారాయణం హోమ బలిహరణ నివేదన, ఒంటి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో అర్చకులు నిర్వహించారు. రథసప్తమి వేడుకల సందర్భంగా భక్తుల రాకను దృష్టిలో పెట్టుకొని ఆలయ అభివృద్ధి కమిటీ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. వాహనసేవ అపురూప దృశ్యాన్ని తిలకించడానికి భక్తులు పొటెత్తారు. భక్తుల గోవిందనామస్మరణ మధ్య స్వామివారి వాహనసేవ వైభవంగా సాగింది. ఏటా మాఘ శుద్ధ సప్తమినాడు ఈ ఉత్సవాన్ని పాలెం గ్రామంలో కన్నుల పండువగా నిర్వహిస్తారు. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. రథసప్తమి రోజు స్వామివారిని దర్శించుకుంటే సమస్త చీడపీడలు తొలగిపోతాయని, దీర్ఘకాలిక రోగాల నుంచి విముక్తి పొందుతామని ఆయురారోగ్యాలు పెంపొందుతాయని భక్తులు విశ్వాసం. భక్తుల రద్దీని దృష్ట్యా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధాన అర్చకులు కురవి రామానుజాచార్యులు మాట్లాడుతూ ఏడు గుర్రాల రథంపై సూర్యుడు ఉత్తరాయణం వైపు ప్రయాణాన్ని ప్రారంభిస్తాడని, ఈ రోజు అరుణోదయ స్నానంతో చర్మ వ్యాధులు, పాపాలు తొలగిపోతాయని విశ్వాసం అన్నారు. రథసప్తమి వేడుకల సందర్భంగా దంపతులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్నారు. రథసప్తమి ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరగా ముస్తాబు చేశారు. రకరకాల పుష్పాలతో, విద్యుత్ దీపాలంకరణతో ఆలయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. ఓ వైపు సూర్యజయంతి మరోవైపు ఆదివారం ఈ పర్వదినాన వెంకటేశ్వర స్వామి నిజరూపాన్ని చూసి తరించేందుకు భక్తజనం పోటెత్తింది. ఆలయ ప్రాంగణంలో భక్తులు తులాభారంతో బంగారం సమర్పించి స్వామి వారిని కొలుచుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తుల కోసం ఐదు రోజులుగా వివిధ భక్తి భజన, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక భాగవత పఠనం నిర్వహించారు. ఆలయం ముందు వెంకటేశ్వర పాలెం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకర్తలు సూర్యారాధనతో సూర్య నమస్కారాలు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన పతంజలి యోగ సమితి రాష్ట్ర అధ్యక్షులు వస్పరి శివుడు మాట్లాడుతూ సూర్య ఆరాధనతో ఆరోగ్యం, జ్ఞానం, ఐశ్వర్యం, దీర్ఘాయుష్షు లభిస్తాయని నమ్ముతారని తెలిపారు. వివిధ జిల్లాల నుంచి హాజరైన భక్తజనానికి ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లతో పాటు అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని జున్ను సోలార్ కంపెనీ ఎండి జున్న శేఖర్ రెడ్డి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మనుసాని విష్ణుమూర్తి, ఈవో రంగారావు, సర్పంచ్ బోనాసి రామకృష్ణ, మాజీ ఎంపీపీ పి.శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ శ్రీనివాసులు. మాజీ ధర్మకర్తల సభ్యులు గాడి సురేందర్, సొప్పరి బాలస్వామి, బోనాసి పెద్దకూర్మయ్య, జగదీష్, కొంకలి మధు, రవీందర్ రెడ్డి, దేవాలయ సిబ్బంది బాబయ్య,శివకుమార్, అర్చకులు జయంత్,శుక్ల తదితరులు పాల్గొన్నారు.



వెంకన్న దర్శనానికి క్యూలైన్లలో నిచ్చున్న భక్తులు



సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

# నిరంతరం జర్నలిస్టుల పక్షాన పోరాటం

**అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు**

**టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్**

**వనపర్తి రూరల్, జనవరి 25 ప్రభాతవార్త :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం జర్నలిస్టుల పక్షాన ఉంటూ టియుడబ్ల్యూజె (ఐజేయూ )పోరాటం కొనసాగిస్తుందని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ అన్నారు. టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రెండవ జిల్లా కార్యవర్గ సమావేశం వనపర్తి జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో జిల్లా అధ్యక్షులు మాధవరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి మధు గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఐజేయు పోరాట ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం 252 జీవోను విడుదల చేసిందని, జర్నలిస్టులకు మేలు చేసే విధంగా అందులో పలు సవరణలు చేయాలని యూనియన్ రాష్ట్ర నాయకత్వం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగిందని వెల్లడించారు. త్వరలో సవరణ చేసిన జీవో విడుదల అవుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి జర్నలిస్టులకు అక్రిడేషన్లు అందే విధంగా యూనియన్ కృషి చేస్తుందని అన్నారు. ఎవరు కూడా ఎలాంటి అపోహకు గురి కావద్దని కోరారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రభుత్వం కేటాయించిన 10 గుంటల స్థలంలో జర్నలిస్టు భవన నిర్మాణానికి కృషి చేస్తామని అన్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని అదేవిధంగా ఎమ్మెల్యేను మంత్రులను కలిసి భవన నిర్మాణం జరిగే విధంగా కృషి చేస్తామన్నారు. జర్నలిస్టుల కుటుంబాలకు ఉచిత హెల్త్ క్యాంపులు వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించడం జరిగిందని త్వరలో పెబ్బేరులో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం మంజూరు చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు యూనియన్ కృషి చేస్తుందన్నారు. ఘణపురం మండల కేంద్రంలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించినప్పటికీ పట్టాలు ఇంకా పంపిణీ చేయలేదని త్వరలో ఎమ్మెల్యేను కలిసి విన్నవిస్తామన్నారు. అదేవిధంగా చిన్నంబావిలో జర్నలిస్టులకు కేటాయించిన ఇంటి స్థలాలను వారికి అందే విధంగా యూనియన్ ఆధ్వర్యంలో మంత్రి జూపల్లి ని కలుస్తామన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించినప్పటికీ కొన్ని దుష్టశక్తులు అడ్డుకున్నాయని మున్సిపల్ ఎన్నికల అనంతరం వనపర్తి పట్టణ కేంద్రంలో పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని అన్నారు. యూనియన్ బలోపేతం దిశగా ప్రతి ఒక్కరు పని చేయాలనీ అన్నారు. జాతీయ కౌన్సిల్ మెంబర్ మల్యాల బాలస్వామి మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా జర్నలిస్టుగా కొనసాగుతూ వృత్తిపరంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటునే యూనియన్ అభివృద్ధికి కృషి చేయడం జరిగిందన్నారు. జర్నలిస్టులు నీతి నిజాయితీతో పని చేయాలని సూచించారు. అనంతరం జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నికైన మల్యాల బాలస్వామిని, సీనియర్ జర్నలిస్టు గోపాల్ ను యూనియన్ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రాజు, కోశాధికారి ధ్యారపోగు మన్యం, యూనియన్ ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, జిల్లా కమిటీ నాయకులు పాల్గొన్నారు.




కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్

# బీఆర్‌ఎస్‌తో అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్సీ చెల్లా

**అయిజ జనవరి 25, ప్రభాతవార్త:** అలంపూర్ నియోజకవర్గంలోని మూడుమున్సిపాలిటీల అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గత ఐదేళ్లలో అయిజ మున్సిపాలిటీని రూ.66కోట్లతో అభివృద్ధి చేసిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీదన్నారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు తెచ్చామని గొప్పలు చెప్పుకుంటూ చేయని పనులకు భూమి పూజలు చేస్తున్నారని విమర్శించారు. ఇక్కడి కాంగ్రెస్ శ్రేణులు మట్టి, ఇసుక, భూదందాలకు పాల్పడుతున్నారని చెప్పారు. అలాంటివారికి మున్సిపల్ ఎన్నికల్లో అవకాశం కల్పిస్తే ఏం అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ శ్రేణులను ఆదరిస్తే అయిజ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. పార్టీ శ్రేణులు కౌన్సిలర్ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు రెండేళ్లు గడిచినా పూర్తిగా అమలు చేయలేదన్నారు. అలాంటి వారు మున్సిపల్ ఎన్నికల్లో ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. అలంపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పెద్దదిక్కుగా చెప్పుకునే వ్యక్తి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. అలాంటి వారికి అవకాశం కల్పించవద్దని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు ఏక్లాసు పురం పురం నరసింహారెడ్డి మునిసిపల్ మాజీ చైర్మన్ దేవన్న, వైస్ చైర్మన్ నరసింహులు, మాజీ కౌన్సిలర్లు సీఎం సురేష్, సువర్ణ, శశికళ, సింగల్ విండో మాజీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పల్లయ్య, జమాలుద్దీన్, రంగారెడ్డి, వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

# విద్యారంగంలో అన్ని వర్గాలకు సముచితం స్థానం : ఎమ్మెల్సీ కూచుకుళ్ల

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 25 ప్రభాతవార్త:** సమాజంలోని అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనాలను నిర్మిస్తుందని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎమ్మెల్సీ కూచకుల్ల దామోదర్ రెడ్డి అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని తూడుకుర్తి గ్రామంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు విద్యను అందించడమే లక్ష్యంగా ఒకే చోట 25 ఎకరాల విస్తీర్ణంలో 2400 మంది విద్యార్థులు కుల మతాలకు అతీతంగా చదువుకునే విధంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మించడం అభినందనీయమన్నారు. గత పాలకులు గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిన వసతులను కల్పించకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న గొప్ప నిర్ణయమే సమీకృత గురుకులాలు అన్నారు. సువిశాలమైన తరగతి గదులు హాస్టల్‌తో పాటు క్రీడా మైదానాలు ఉంటాయన్నారు. సదరు టెండర్ పొందిన కాంట్రాక్టర్‌కు రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని కోరారు. ఎస్సీ ,ఎస్టీ, బీసీ మైనారిటీ విద్యార్థులు అందరూ ఒకే చోట విద్యను అభ్యసించడం వల్ల సమాజంలోని అసమానతలు తొలుగుతాయన్నారు. 235 కోట్లతో 650 పడకల ఆసుపత్రి నిర్మాణానికి కూడా 2 రోజుల క్రితం పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. విద్యా వైద్యరంగంలో నాగర్‌కర్నూల్ నియోజకవర్గాన్ని ముందు ఉంచాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, మాజీ ఎంపీపీ కోటయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారు ఇంద్రారెడ్డి, కరుణాకర్ రెడ్డి, కూచకుల్ల నరసింహారెడ్డి, తూడుకుర్తి సర్పంచ్ సత్తావరం లక్ష్మీ కరుణాకర్ రెడ్డి లతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ

# వేరుశనగ రైతులకు సన్మానం

**- సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం... - కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సంజీవ్‌కుమార్ యాదవ్**

**కల్వకుర్తి, జనవరి 25 ప్రభాతవార్త:** రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతును దేశానికి రాజు చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేస్తున్న తరుణంలో వేరుశనగ రైతులకు మద్దతు ధర కల్పించి అత్యధిక ధర పలికిన రైతులకు వ్యవసాయంపై మక్కువ పెరిగే విధంగా చేసి వ్యవసాయాన్ని అభివృద్ధి పరిచేందుకు రైతన్నలకు సన్మానం చేయడం శుభ పరిణామమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సంజీవ్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు అత్యధిక ధర పలికిన రైతన్నలను ఎంపిక చేసుకొని కల్వకుర్తి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాలు నిర్వహించడం ప్రజా ప్రభుత్వంలో రైతన్నకు దక్కుతున్న గౌరవమన్నారు. అదేవిధంగా కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు రైతులతో కలిసి రైతన్నలు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడంతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలా చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి సంబురాలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన వేలంలో వేరుశనగ క్వింటాల్‌కు గరిష్టంగా రూ. 11,029 ధర పలికినట్లు మార్కెట్ కమిటీ అధికారులు తెలిపారు. వేరుశనగ 487.90 క్వింటాలు 1623 బస్తాలు ఎక్కువ ధర 12009కగా, తక్కువ ధర 7109, మధ్య రకం ధర 10950, మొత్తం వచ్చిన రైతులు 71మంది అని మార్కెట్ కమిటీ అధికారులు తెలిపారు.

## శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల



పాఠశాలలో మచ్చుకు పెచ్చులు ఊడిన దృశ్యం

**నారాయణ పేట, జనవరి 25 ప్రభాతవార్త :** నారాయణపేట మండలం అవంగాపూర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆదివారం గ్రామ సర్పంచ్ రవికుమార్, ఉప సర్పంచ్ గుండేపల్లి రాధాకృష్ణ సందర్శించి పరిశీలించారు. పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండడం గమనించిన వారు, పాఠశాల స్థితిగతులపై ప్రధానోపాధ్యాయురాలు సునందతో పాటు ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో చదువుకోవడం ఆందోళనకరమని తెలిపారు ఈ విషయాన్ని సంబంధిత విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పాఠశాల భవన పునర్నిర్మాణానికి తక్షణ చర్యలు చేపట్టేలా కృషి చేస్తామని గ్రామ ప్రతినిధులు హామీ ఇచ్చారు.

## ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం




విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

**మాగనూర్, జనవరి 25 ప్రభాతవార్త:** మాగనూర్ మండలంలో తహసిల్దార్ బి.సురేష్ కుమార్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.గ్రామంలో ఓటు హక్కు వినియోగం పై అవగాహన కల్పిస్తూ మండల రెవెన్యూ కార్యాలయంనుండి మాగనూర్ బస్టాండ్ కూడలివరకు రెవెన్యూ సిబ్బంది, హాస్టల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ అఫ్జల్ అహ్మద్,అంగన్వాడి టీచర్లు,కాంగ్రెస్ నాయకులు దండు సత్యనారాయణ,గ్రామస్తులతో పాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా శివపార్వతుల పల్లకి సేవ



పల్లకి సేవ నిర్వహిస్తున్న శివస్వాములు, భక్తులు

**దేవరకద్ర, జనవరి 25 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలో స్థానిక శివాలయం దగ్గర ఆదివారం శివపార్వతుల ఉత్సవ మూర్తుల పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి మఠం సురేష్ స్వామి ఆధ్వర్యంలో ముందుగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు,పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన శివ పార్వతుల ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుతీర్చి, మేళాతాళాల మధ్య పూరవీధులనుండి ఆలయం చుట్టూ ఊరేగించారు.భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో చెన్నకేశవ స్వామి భజన పరులు, శివ స్వాములు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో
## యువ డాన్స్ మాస్టర్ మృతి

**అయిజ జనవరి 25, ప్రభాతవార్త:** పట్టణంలోని బ్రాహ్మణ వీధికి చెందిన నరసింహయ్య మంజుల దంపతుల కుమారుడు డాన్స్ మాస్టర్ సందీప్ 35 ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు డాన్స్ ప్రాక్టీస్ చేయించి ఇంటికి వెళ్లి గుండెపోటుకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అతడిని ఆసుపత్రికి తరలించే లోపు ఇంటి వద్ద మృతి చెందాడన్నారు. డాన్స్ మాస్టర్ మృతితో పట్టణంలో విషాదఛాయలు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న డాన్స్ స్టూడెంట్స్ కన్నీటి పర్యంతం అయ్యారు. చేతికొచ్చిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు దుఃఖసాగరంలో మునిగారు. అలాగే పట్టణంతోపాటు మండల పరిసర గ్రామాలలో చిన్నారులకు డ్యాన్స్ నేర్పిస్తూ అందరికీ చూపరిచితుడు అయ్యాడు. సందీప్ అకాల మరణంతో అందరూ దిగ్భ్రాంతికి లోనయ్యారు.

## మహబూబ్‌నగర్ అభివృద్ధి బాధ్యత నాది

**(మొదటి పేజీ తరువాయి)**

జరగలేదని విమర్శించారు. రాబోయే 3-4 సంవత్సరాల్లో మహబూబ్ నగర్ నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులతో మహబూబ్ నగర్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి కోసం శాశ్వత పరిష్కారాల దిశగా అడుగులు వేస్తున్నామని, నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. నాడు మహబూబ్ నగర్‌ను మున్సిపాలిటీ నుంచి మున్సిపల్ కార్పొరేషన్‌గా అభివృద్ధి చేసిన సమయంలో కొందరు విమర్శలు చేశారని చెప్పారు. కానీ వారి అపోహలను పటాపంచలు చేస్తూ స్వయానా ముఖ్యమంత్రి రూ.1200 కోట్లతో నగర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. అంతేకాక రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి అధిక సంఖ్యలో నిధులు మంజూరు చేయించడంతో పాటు, హైదరాబాద్, వరంగల్ తర్వాత అంతటి మహానగరంగా మహబూబ్ నగర్‌ను అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎవరు పోటీచేసినా భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు అహ్మద్ ఖాన్, గుముడాల గోవర్ధన్ గౌడ్, కాలనీ పెద్దలు రాములు నాయక్, నర్సింహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆ తల్లి రోదన వర్ణనాతీతం

**(మొదటి పేజీ తరువాయి)**

వివరాల ప్రకారం ముచ్చర్లపల్లికి చెందిన శ్రీకాంత్ రెడ్డి కుమార్తె సిరి (14), కుమారుడు శ్రీమన్యు (14), శ్రీకాంత్ రెడ్డి అక్క కుమార్తె స్నేహ (16)లు ప్రమాదవశాత్తు వ్యవసాయ కుంటలో పడిపోయారు. శ్రీకాంత్ రెడ్డి హైదరాబాద్ లోని తుర్కయంజాల్‌లో నివసిస్తున్నారు. తన అక్క చంద్రకళ రావిర్యాలలో ఉంటారని, శ్రీకాంత్ రెడ్డి అమ్మ అనారోగ్యంతో ఉందని తెలియగా చూడటానికి వచ్చి పొలం వద్దకు వెళ్లారని అంతలోనే ఇంతటి ఘోరం చోటు చేసుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మొదట ఒకరు ప్రమాదవశాత్తు నీటిలో పడగా, వారిని రక్షించే క్రమంలో మిగతా ఇద్దరు కూడా లోపలికి వెళ్లి నీటిలో మునిగిపోయినట్లు తెలిపారు. స్థానికులు గమనించి వారిని వెలికితీసే లోపే ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు. శ్రీకాంత్ రెడ్డికి చెందిన ఇద్దరు పిల్లలు (సిరి, శ్రీమన్యు) ఒకేసారి మృతి చెందడం ఆ కుటుంబాన్ని కోలుకోలేని దెబ్బ తీసింది. అల్లారుముద్దుగా పెరిగిన పిల్లలు కళ్లముందే నిర్జీవంగా పడి ఉండటంతో తల్లిదండ్రుల రోదనలు అక్కడి వారిని కలచివేశాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## రాష్ట్రంలో విద్య,వైద్యానికి పెద్దపీట

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రారంభించారు. ఆసక్తి ఉన్న యువతి యువకులు ఉపాధి కోర్సుల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మూడు నెలలు శిక్షణతో పాటు ఉచిత భోజన వసతి ఉన్నట్టు తెలిపారు. ఆదివారం మక్తల్ లో మంత్రి పర్యటన ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో మక్తల్ తాహసిల్దార్ సతీష్ కుమార్, సిఐ రామ్ లాల్ మక్తల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏ.రవికుమార్ , మక్తల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, మక్తల్ జడ్పిటిసి లక్ష్మారెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గాయత్రి అనిల్ కుమార్, కోళ్ల వెంకటేష్ కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు వాకిటి భాస్కర్, బ్యాగరి సురేష్, కాంగ్రెస్ నాయకులు కట్టా సురేష్, హేమ సుందర్ పొర్ల నరసింహతో పాటు కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## అత్యంత శక్తివంతమైన ఆయుధం ఓటు

**మొదటి పేజీ తరువాయి భాగం..**

భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) రిపబ్లిక్ డే కి ఒక రోజు ముందు అంటే జనవరి 25, 1950న ఏర్పడిందని, అందుకే ప్రతి ఏటా ఈ రోజున జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని వివరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది అత్యంత శక్తివంతమైన ఆయుధమని, మంచి సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇందుకోసం ఫారం6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్ ద్వారా కూడా సులభంగా నమోదు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం 5.06 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, అందులో సగానికి పైగా మహిళా ఓటర్లు ఉన్నారని తెలిపారు. మహిళలు ఓటింగ్ ప్రక్రియలో ఉత్సాహంగా పాల్గొంటున్నారని ఆయన అభినందించారు. మై ఇండియా మై ఓట్ అనే ఇతివృత్తంతో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల యాదయ్య మాట్లాడుతూ మంచి సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్క ఓటు కీలకమని తెలిపారు. కాబట్టి ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారు ఫామ్ 6 ద్వారా దరఖాస్తు చేసుకుని ఓటు హక్కును పొందవచ్చని తెలిపారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందాలని, అంతేకాకుండా దాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా తయారీ, ఎన్నికల విధుల్లో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. అదేవిధంగా వికలాంగ ఓటర్లకు, సీనియర్ సిటిజన్ ఓటర్లకు, ట్రాన్స్ జెండర్ ఓటర్లకు, 18 ఏళ్ల నుండి కొత్తగా ఓటు హక్కు కలిగిన ఓటర్లను సన్మానించారు. అంతకుముందు ఓటర్లలో అవగాహన కల్పించేందుకు మర్రికుంటలోని తెలంగాణ గిరిజన సంక్షేమ పాఠశాల నుండి ఐడిఓసి వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ జిల్లా శాఖల అధికారులు, ఎన్నికల అధికారులు, తహసిల్దార్లు, సీనియర్ సిటిజన్ ఓటర్లు, విద్యార్థులు, కొత్త ఓటర్లు, వికలాంగ ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఓటుతోనే ప్రజాస్వామ్యం పటిష్టం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశం లో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ జాతీయ ఎన్నికల కమిషనర్, రాష్ట్ర ఎన్నికల సంఘం పిలుపు మేరకు "నా భారత దేశం నా ఓటు" అనే అంశంతో జాతీయ ఓటర్ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటు హక్కు నమోదు, వినియోగం పై భారత ఎన్నికల సంఘం ఆదేశాల ననుసరించి ఓటర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 7,38,551 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారని అన్నారు. 18 నుండి 19 సంవత్సరాల వయస్సులో యువ ఓటర్లు 21,731 నమోదు చేసుకున్నారని, ఇందులో 12,316 యువకులు, 9415 మంది యువతులు ఉన్నారని తెలిపారు. ఇంకా నమోదు కాకుండా ఉన్న యువ ఓటర్ లు ఉన్నారని తెలిపారు. వీరందరినీ ఓటర్ గా నమోదు చేయుటకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగించాలని, కళాశాలలో 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్క యువతి, యువకుడు ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు. ఈ మధ్య కాలంలో జరిగిన ఎన్నికలను గమనిస్తే , పల్లెలతో పోల్చుకుంటే పట్టణాలలో ఓటింగ్ శాతం తగ్గుతుందని, దీనిని పెంచేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఓటు ఎంతో విలువైందని, ఓటు ఉన్న ప్రతి ఒక్క పౌరుడు ఓటును ఒక బాధ్యతగా భావించి కచ్చితంగా తన ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సమావేశంలో హాజరైన యువతి వ్యాకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారుల చే "ఓటర్ ప్రతిజ్ఞ" చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, డిపిఆర్ఓ పి.శ్రీనివాస్, జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీనివాస్, ఎన్నికల డిటి జాఫర్, సిఎంఓ సుధాకర్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి రఘు, అర్బన్ తహశీల్దార్ ఘన్సీరాం, తదితరులు పాల్గొన్నారు

## పదేళ్లలో ఒక్క షెడ్ నిర్మించలె

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ఆరోపించారు. జడ్చర్ల కి ఐఐఐటి కళాశాల మంజూరు అయినప్పుడు సంతోషించాల్సింది పోయి, కమిషన్ల కోసం ఉదండాపూర్ విషయాన్ని ప్రస్తావించడం దురదృష్టకరమని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత మాజీ ఎమ్మెల్యేకు లేదని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ప్రజల అభివృద్ధికి కట్టుబడి ఉందని, సీఎం రేవంత్ రెడ్డి తమ అభ్యర్థనలను సానుకూలంగా స్వీకరించి వెంటనే మంజూరు చేస్తారని తెలిపారు. మార్కెట్ కమిటీ ప్రతినిధుల కోరిక మేరకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుని కలిసి, మొదటి విడతలో కొత్త షెడ్ మంజూరు చేయించామని, రెండో విడతలో పాత షెడ్ల పునర్నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. మంత్రి 1.75 కోట్ల రూపాయలతో షెడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం ఆనందదాయకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తంగేళ్ల జ్యోతి అల్వాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత నర్సింహులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలకు సిద్ధమైన పరేడ్ గ్రౌండ్

**మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 25 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం పరిధిలోని కవాతు మైదానం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు సర్వాంగసిద్ధంగా సిద్ధమైంది. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ అధికారిక కార్యక్రమానికి ముందుగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఫైనల్ రిహార్సల్ నిర్వహించారు. ఆర్ఐ అడ్మిన్ కృష్ణయ్య పరేడ్ కమాండర్‌గా వ్యవహరించగా, పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో కవాతు నిర్వహించారు. జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని అధికారులు కోరారు.



గణతంత్ర దినోత్సవ వేడుకలలో పరేడ్‌కు రిహార్సల్ చేస్తున్న దృశ్యం

# యువత భవితకు భరోసానిచ్చేదే కాంగ్రెస్

**- గత పాలకులు రాష్ట్రాన్ని దోచుకుని దాచుకున్నారు**
**- మాజీ ఎమ్మెల్యే మట్టి,ఇసుకపై దృష్టిపెడితే తాము అభివృద్ధిపైనే దృష్టిపెట్టాం**
**- భూత్పూర్‌లో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే జీఎంఆర్ విమర్శనాస్త్రాలు**
**- ఎమ్మెల్యే జీఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ బాలకోటి**

**భూత్పూర్, జనవరి 25, ప్రభాతవార్త :** సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం యువత భవితకు భరోసానిచ్చి, అభివృద్ధి సంక్షేమం కోసం ప్రజా పాలన సాగిస్తోందని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూదన్‌రెడ్డి అన్నారు. గత పాలకులు తమ స్వప్రయోజనాల కోసమే పనిచేశారని, మట్టి, ఇసుక అంటూ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనుల్లో సొంత వాహనాలు ఏర్పాటు చేసుకుని కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టి దోచుకుని దాచుకున్నారని విమర్శించారు. ఆదివారం బీఆర్ఎస్ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ బాలకోటి కాంగ్రెస్ పార్టీలో చేరిన నేపథ్యంలో బాలకోటి అతని అనుచరులు వందలాది మంది ఎమ్మెల్యే జీఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన బాలకోటి అతని అనుచరులకు ఎమ్మెల్యే జీఎంఆర్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు బాలకోటి తన అనుచరులు, తండావాసులు, కాంగ్రెస్ అభిమానులు, మహిళలు, యువకులతో అమిస్తాపూర్ నుంచి భూత్పూర్ వరకు మూడు కిలో మీటర్ల భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహిస్తూ భూత్పూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభాస్థలికి చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డిహాజరయ్యారు. భూత్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ అధ్యక్షతన ఏర్పాటైన ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు జీవన్‌రెడ్డి, బెక్కరి మధుసూధన్‌రెడ్డి, మాజీ ఎంపిపి కదిరె శేఖరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ ప్రాంతానికి ప్రాతినత్యం వహించిన మాజీ ఎమ్మెల్యే ధనార్జనే ధ్యేయంగా పెట్టుకుని ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని పేర్కొన్నారు.



భూత్పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**నవీన్‌గౌడ్‌కు ముడా చైర్మన్ పదవీ : ఎమ్మెల్యే జీఎంఆర్**

పార్టీ కోసం తన సర్వస్వం ధారపోసి కష్టించి, తన గెలుపునకు పరోక్షంగా పాటుపడిన ఇక్కడి పార్టీ పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ అహర్నిశలు శ్రమించారని, నవీన్‌గౌడ్‌కు మున్సిపల్ చైర్మన్ టికెట్ ఇస్తానని గతంలో మాటిచ్చానని, కానీ రిజర్వేషన్‌లో ఇక్కడి చైర్మన్ స్థానం ఎస్టీ జనరల్‌కు వచ్చిందని, దీంతో నవీన్‌గౌడ్ కొంత అసంతృప్తికి గురయ్యారని, నవీన్‌గౌడ్‌కు మరో ఆరు నెలల్లో ఖాళీ ఏర్పడే ముడా చైర్మన్ పదవీని కట్టబెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించానని, నవీన్‌గౌడ్ చైర్మన్ పదవీ ఇచ్చి తీరుతానని ఎమ్మెల్యే జీఎంఆర్ నిక్కచ్చిగా నవీన్‌గౌడ్‌కు హామి ఇచ్చారు.

**కాంగ్రెస్‌ది ప్రజా సంక్షేమ ప్రజాపాలన : డీసీసీ అధ్యక్షుడు సంజీవ్‌ముదిరాజ్**

కాంగ్రెస్‌ది ప్రజాసంక్షేమ ప్రజాపాలన అని కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు సంజీవ్‌ముదిరాజ్ అన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ నియోజరవర్గానికి కోట్లాది రూపాయల నిధులు తెచ్చి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు విశిష్ట సేవలందిస్తూ ప్రజల మనిషి అనిపించుకున్నారన్నారు. కాంగ్రెస్ సత్తా ఏమిటో సర్పంచు ఎన్నికల్లో నిరూపించామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అదేస్ఫూర్తితో పనిచేసి కాంగ్రెస్ విజయానికి పాటుపడాలని సూచించారు.

**దేవరకద్ర నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీలు గెలవాలి : కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మన్నె జీవన్‌రెడ్డి**

దేవరకద్ర నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీ(భూత్పూర్, కొత్తకోట, దేవరకద్ర)లను గెలిచి కాంగ్రెస్ చైర్మన్లే ఉండాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మన్నె జీవన్‌రెడ్డి అన్నారు. ఇందుకోసం కాంగ్రెస్ ప్రతీ కార్యకర్త కష్టించి పని చేయాలని సూచించారు.

**బీసీ రిజర్వేషన్ రాకపోవడం దురదృష్టకరం : పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్**

తాను పార్టీకి అంకితభావంతో పనిచేశానని, ఎమ్మెల్యే జీఎంఆర్ గెలుపునకు తన శక్తివంచన లేకుండా కృషిచేశానని, బీసీ రిజర్వేషన్ అవుతుందని, తానే చైర్మన్ అభ్యర్థినని ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రకటించారని, దురదృష్టం, రిజర్వేషన్ వల్ల తనకు చైర్మన్ పదవీ దక్కడం లేదని లిక్కి నవీన్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. తన సేవల్ని ఎమ్మెల్యే జీఎంఆర్ గుర్తిస్తారని అన్నారు. కాంగ్రెస్ పథకాలు నచ్చి, ఎమ్మెల్యే జీఎంఆర్ చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్శితుడనై తన అనుచరులు వంద మందితో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానని ఎమ్మెల్యే జీఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ముదావత్ బాలకోటి(బాలు)స్పష్టం చేశారు. ఐదేండ్లు భూత్పూర్ మున్సిపాలిటీలో కౌన్సిలర్‌గా పనిచేసి పట్టణ ప్రజల అభిమానాన్ని చూరగొన్నానని, కాంగ్రెస్ పార్టీలో సీనియర్ల మాట మీద గౌరవముంచి నడుచుకుంటానని బాలకోటి అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు కెంద్యాల పద్మ, జిల్లా ఉపాధ్యక్షుడు మందడి నర్సింహ్మారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌గౌడ్, సర్పంచులు మాసగౌడ్, తారునాయక్, ఆనంద్‌రెడ్డి, సంజీవరెడ్డి, రఘుపతిరెడ్డితో పాటు ఇతర నాయకులు బోరింగ్ నర్సింహులు, గడ్డం ఎల్లప్ప, సంజీవరెడ్డి, కొండన్న, కోరె పవన్. ఆగిరి రవి, రవీందర్‌రెడ్డి, ఎర్రవాపు నర్సింహులు, కెంద్యాల నరేందర్, కెంద్యాల తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపేట జిల్లాను తొలగిస్తే ఊరుకోం

**మున్సిపాలిటీ ఎన్నికలలో బిజెపికి అవకాశం ఇవ్వండి : ఎంపీ డీకే అరుణ**

**నారాయణపేట, జనవరి 25 ప్రభాతవార్త:** జిల్లాల పునర్వ్యవస్థీకరణ పేరుతో నారాయణపేట జిల్లాను తొలగిస్తారని ప్రచారం జరుగుతుందని, తొలగిస్తే ఊరుకునే ప్రసక్తి లేదని ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ఏ క్షణమైన రావచ్చని బిజెపి శ్రేణులు సిద్ధంగా ఉండాలని కోరారు. నారాయణపేట మున్సిపాలిటీలో బీజేపీ జెండా తెగరాలని ఆకాంకించారు. పదేండ్లు బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిందని ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. అవినీతి అంతం చేస్తామనే మాట ఉత్తి మాటగా మిగిలిపోయిందని అన్నారు. సోనియా గాంధీ జన్మదినం నాడే ఆరు గ్యారంటీలు అమలు అన్నారు. ఏ హామీ అమలు చేయడం లేదన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఫ్రీ బస్ సౌకర్యం కల్పించి పురుషుల నుంచి డబుల్ చార్జీలు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలకు రూ. 2500 ల ఆర్థిక భరోసా, వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళల పెన్షన్ పెంపుదల ఏమైందని ప్రశ్నించారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజలను మభ్య పెట్టేందుకు మరోసారి మోసపూరిత హామీలు ఇస్తున్నారని అన్నారు. ఎన్నికలు వస్తున్న సమయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు హడావిడిగా శంకుస్థాపనలు చేసి వెళ్తున్నట్లు తెలిపారు. ఇప్పటికి మున్సిపాలిటీలకు చిల్లిగవ్వ ఇవ్వలేదని, వందల కోట్ల హామీలు ఇస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు మరోసారి కాంగ్రెస్ మాటలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ లలో కేంద్రం ద్వారా వచ్చిన నిధులు, ప్రజల నుంచి వచ్చిన పన్నుల ద్వారా మాత్రమే అభివృద్ధి జరుగుతుందన్నారు. గతంలో స్టేడియం కి 10 కోట్లు ప్రకటించారు. కానీ ఇప్పటికి ఇవ్వలేదని గుర్తు చేశారు. మరోసారి మంత్రి స్టేడియం అభివృద్ధికి 30 కోట్లు ఇస్తామంటున్నారు ఎలా నమ్మాలన్నారు. అమృత్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంటే, దానిని రాష్ట్ర ప్రభుత్వం ఖాతాలో వేసుకునే ప్రయత్నం మంత్రులు చేస్తు తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. అమృత్ పథకానికి నిధులు ఎక్కడినుంచి వస్తున్నాయో కూడా అవగాహన లేకుండా మంత్రులు మాట్లాడుతున్నారని మంది పడ్డారు. అమృత్ పథకంలో అభివృద్ధి పనులకు కేంద్రం తన వాటా ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకుండా పెండింగ్ లో పెడుతుందన్నారు. ఆత్మకూరులో అమృత్ పథకం నిధుల కింద మంజూరు అయిన అభివృద్ధి పనులకు నిన్న మంత్రి హడావిడిగా రాత్రికి రాత్రి శిలాఫలకం వేసి, ఉదయం శంకుస్థాపనలు చేసి టెంకాయలు కొట్టాల్సిన కక్కుర్తి ఎందుకని ప్రశ్నించారు. ఎంపీగా తమకు ప్రోటోకాల్ ఇవ్వడంలేదని, కనీస సమాచారం అందించడం లేదని ఎంపీ డీకే అరుణ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వ నిధులుగా చెప్పాల్సిన కక్కుర్తి హడావిడి మంత్రులకు ఎందుకనీ ప్రశ్నించారు. కేంద్రానికి పన్నులు కడితే ఇస్తుందిని ఆనిధులే రాష్ట్రానికి వస్తున్నాయని కొందరు మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణ దేశంలో ఉందా? లేదా?అని ప్రశ్నించారు. ప్రజలు కడుతున్న పన్నుల నుంచి కాకుండా కాంగ్రెస్ నేతల ఇండ్ల నుంచి ఆస్తులు అమ్మి రాష్ట్ర ప్రభుత్వం నడుపుతున్నారా అని అసహనం వ్యక్తం చేశారు. ఓట్ల కోసం జూటా మాటలు మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తున్న పార్టీ బీజేపీ. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆలస్యం లేకుండా ఇస్తుందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ఇవ్వడంలో ఆలస్యం చేస్తుందని తెలిపారు. అభివృద్ధి కుంటు పడుతుందని మదనపడ్డారు. కేంద్రం ఇచ్చే నిధులు మేము చెప్పుకుంటాం, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు మీరు చెప్పి ఓట్లు అడిగే దమ్ము రాష్ట్ర ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు. రాజకీయాలు కాదు, అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా కలసి పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ కి ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. అన్ని వర్గాల ప్రజలకు లబ్ది జరిగే లక్ష్యంతో మోదీ సర్కార్ పని చేస్తుందని చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్యంతో 2047 నాటికి ప్రపంచ దేశాల సరసన అభివృద్ధి చెందిన దేశంగా నిలిపేందుకు పని చేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ లక్ష్యం నెరవేర్చే విధంగా మున్సిపాలిటీల అభివృద్ధి చేసే అవకాశం బీజేపీ కి ఇవ్వాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, రతంగ్ పాండురెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, తిరుపతి రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పోషాల్ వినోద్, రఘు రామయ్యగౌడ్, సత్య రఘుపాల్ రఘువీర్ యాదవ్, మిర్చి వెంకటయ్య, వెంకట్రములు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎంపి డికె అరుణ

## విజయవంతంగా ముగిసిన ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ సర్వే

**ఈ అడవులు టైగర్ సంరక్షణకు ప్రత్యేక ప్రాంతం: ఎఫ్‌ఆర్ఓ ఈశ్వర్**

**లింగాల, జనవరి 25 ప్రభాతవార్త :** అచ్చంపేట డివిజన్ పరిధిలో నిర్వహించిన ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ సర్వే లింగాల పరిధిలో ఆదివారం విజయవంతంగా ముగిసిందని ఎఫ్ఆర్ఓ ఈశ్వర్ అన్నారు. ఈసందర్భంగా లింగాల అడవుల్లో మొత్తం 15 వేల హెక్టార్ల విస్తీర్ణం కలిగి ఉండడంతో 4 సెక్షన్లు, 13 బీట్స్ గా విభజించబడి ఉందన్నారు. ఈ ప్రాంతంలో భౌరమ్మ టైగర్, ఎఫ్18 దాని పిల్లలు, అలాగే ఎం19 నెంబర్ గల టైగర్ స్వేచ్ఛగా సంచరిస్తున్నట్లు నిర్ధారణ అయినట్లు తెలిపారు. ఈ అడవుల్లో టైగర్ల సంతానోత్పత్తి అనుకూలంగా ఉందన్నారు. చిరుత పులులు, అడవి పిల్లులు, ఎలుగుబంట్లు మాంసాహార జంతువులతో పాటు చుక్కల దుప్పులు, మాన్లు, అడవి పందులు, నీలిగాయి, ముళ్ళ పందులు వంటి శాఖాహార జంతువుల ఈ ప్రాంతంలో ఎక్కువగా సంచరిస్తున్నట్లు తెలిపారు. సర్వే ప్రకారం పులులు, చిరుతపులులకు సంబంధించిన పాదముద్రలు, స్కాట్ జీవచిహ్నాలను శాస్త్రీయంగా నమోదు చేసినట్లు తెలిపారు. ఈ విస్తారమైన అడవుల్లో అక్కడక్కడ సోలార్ బోర్లు వేసి నీటి కుంటలు ఏర్పాటు చేయడం వల్ల టైగర్ సంరక్షణకు కీలక ప్రాంతంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ అధికారులు, సిబ్బంది, బేస్ క్యాంప్ వాచర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ముచ్చర్లపల్లి ఘటన అత్యంత బాధాకరం

**తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి**

**బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి**

**జడ్చర్ల, జనవరి 25 ప్రభాతవార్త:** జడ్చర్ల నియోజకవర్గం ఊరుకొండ మండలం ముచ్చర్లపల్లి గ్రామంలో ముగ్గురు చిన్నారులు మృతి చెందడం పై మాజీ మంత్రి, బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు డా.సి.లక్ష్మారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సెలవుల కారణంగా కుటుంబ సభ్యులతో గ్రామానికి చేరుకున్న చిన్నారులు సిరి, శ్రీమన్యు, స్నేహ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. లోతుగా ఉన్న గుంతలను వెంటనే పూడ్చాలని, నీరు నిల్వ ఉండే గుంతలు, లోతుగా ఉండే గుంతల వద్ద ప్రమాద హెచ్చరిక, కంచె, హెచ్చరిక బోర్డులు అయినా ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి సూచించారు.



## ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా టి. శ్రీనివాసులు

**నర్వ, జనవరి25 ప్రభాతవార్త:** మండల పరిషత్తు అభివృద్ధి అధికారుల సంఘం నారాయణపేట జిల్లా అధ్యక్షుడిగా నర్వ ఎంపీడీఓ టి.శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నారాయణపేట జిల్లా పరిషత్ కార్యాలయంలో అన్ని మండలాల ఎంపీడీఓలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎంపీడీఓ టి.శ్రీనివాసులుతో పాటు దామర్గిద్ద ఎంపిడిఓ సాయిలక్ష్మిని ఉపాధ్యక్షులుగా, మక్తల్ ఎంపీడీఓ రమేష్ కుమార్ లనుజనరల్ సెక్రటరీలుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన ఎన్నిక పట్ల నర్వ ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ఆయనకున్న పట్టును గుర్తించి జిల్లా పదవిని అప్పగించారని పలువురు అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఆయా మండలాల ఎంపీడీఓలు పాల్గొన్నారు.

## గణతంత్ర రాజ్యాంగా దేశం వర్ధిల్లాలి : ఎమ్మెల్యే

**దేవరకద్ర, జనవరి 25 ప్రభాతవార్త:** ప్రజాస్వామిక, సార్వభౌమ, గణతంత్ర రాజ్యంగా భారతదేశం వర్ధిల్లాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. నేడు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవరకద్ర నియోజకవర్గ ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజున జరుపుకునే ఈ పండుగను ప్రజలందరూ సగర్వంగా జరుపుకోవాలన్నారు. రాజ్యాంగ నిర్మాతలను, దేశాన్ని సమూన్నతంగా నిలబెట్టిన మహనీయులను గుర్తు చేసుకోవాలన్నారు. ప్రజల పోరాటంతో పాటు రాజ్యాంగం ఇచ్చిన హక్కుల ద్వారానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. తెలంగాణలో కొలువు దీరిన కొత్త ప్రభుత్వం, రాజ్యాంగ ఆశయాలు, లక్ష్యాలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉందని అన్నారు. అధికారం చేపట్టిన మొదటి రోజు నుంచే తమ ప్రభుత్వం ప్రజాపాలన శ్రీకారం చుట్టిందని, ప్రజలే పాలకులనే జవాబు దారితనంతో పని చేస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు.

## కమ్యూనిటీ హాలుకు భూమి పూజ చేసిన ఎంపీ డీకే అరుణ

**మక్తల్ టౌన్, జనవరి 25 ప్రభాతవార్త :** మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని దండు గ్రామంలో ఎంపీ డీకే అరుణ నిధుల నుండి పది లక్షల రూపాయలతో శివాలయం దగ్గర కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొండయ్య , జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్ రతంగ్ పాండు రెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శి బలరామ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కర్ని స్వామి, అర్బన్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

**దామరగిద్ద, జనవరి 25 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలంలో తహసిల్దార్ తిరుపతయ్య ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో ఓటు హక్కు వినియోగం పై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఉత్తమ బిఎల్ఓగా శారద, లక్ష్మమ్మ, కనకప్ప, వెంకటమ్మ, రఫీ, ఎన్నికైన వారిని మండల తాసిల్దార్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, గిర్దవర్లు బాలరాజ్, వెంకటరమణ, జిపిఓలు, బిఎల్ఓలు ,అంగన్‌వాడి టీచర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## 18 ఏళ్లు నిండితే ఓటరుగా నమోదు చేసుకోవాలి

**అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మధుసూదన్ నాయక్**

**ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ ప్రారంభం**

**మహబూబ్‌నగర్, జనవరి 25 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలో స్టేడియం గ్రౌండ్ నుంచి 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఫిట్ ఇండియా సైకిల్ డ్రైవ్ ర్యాలీని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ లు జండా ఊపి ప్రారంభించారు. 18 సంవత్సరాలు పూర్తైన ప్రతి ఒక్క యువతి, యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేలా ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా, తిరిగి స్టేడియం గ్రౌండ్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చెంచు కాలనీలో సోలార్ వీధిలైట్లు

**లింగాల, జనవరి 25, ప్రభాతవార్త:** గ్రామంలో చీకట్ల నుంచి వెలుగులు నింపేందుకు సోలార్ వీధిలైట్లు ఏర్పాటు చేయిస్తున్నట్లు సర్పంచ్ మూడవత్ శంకర్ అన్నారు. లింగాల మండల పరిధిలోని పద్మనపల్లి గ్రామంలో నిర్మల్ సంస్థ హైదరాబాద్ సహకారంతో సోలార్ వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఈ సోలార్ వీధిలైట్లను స్థంబాలకు అమర్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు విష్ణు, చెంచు కాలనీ పెద్దలు రామస్వామి, వీటిడిఏ అధ్యక్షులు సలేశ్వరం పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధం

**డిప్యూటీ తహశీల్దార్ కృష్ణాజీ**

**లింగాల, జనవరి 25 ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఆయుధమని, దానిని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసిల్దార్ కృష్ణాజీ అన్నారు. ఆదివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా లింగాల మండల కేంద్రంలోని విద్యార్థులచే ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా డిప్యూటీ తహసిల్దార్ కృష్ణాజీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధమని అన్నారు. 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అనిల్, సతీష్, శ్రీకాంత్, నాయకులు పూజారి వెంకటయ్య, శ్రీశైలం, రవి, సలేశ్వరం, విఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్ని రంగాలలో మహిళలకు సమాన హక్కులు కల్పించాలి

**వీపనగండ్ల జనవరి 25, ప్రభాతవార్త:** సమాజంలో మహిళలకు అన్ని రంగాలలో సమాన హక్కులు కల్పించాలని వనపర్తి జిల్లా అద్వా కోశాధికారి గోపాల్దిన్నె సర్పంచ్ దొడ్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమాజంలో మహిళలను కించపరిచే విధంగా ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయని వాటిని రూపుమాపాలన్నారు. పురుషులకు సమానహక్కులు ఏరకంగా అయితే ఉన్నాయో అదే విధంగా స్త్రీలకు కూడా ఉండాలన్నారు. ప్రజా ప్రభుత్వం పాలనలో స్త్రీలకు సమభాగం అవకాశాలు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. హైదరాబాదులో జరుగుతున్న ఐద్వా మహాసభలకు వీపనగండ్ల మండలం నుండి ఆదివారం నాడు మహిళలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మాజీ సర్పంచ్ కాంతమ్మ , జిల్లా ఉపాధ్యక్షులు రేణుక జిల్లా నాయకురాలు బత్తుల మంజుల , కార్యకర్తలు పాల్గొన్నారు.